పద్ధతి మార్చినారు

ఒకప్పుడు రైతులు తమకు కావాల్సిన కూరగాయలు, ఆకు కూరలను వారే పండించుకునేవారు. దానికి కావాల్సిన విత్తనాలు, నారును తయారు చేసుకునేవారు. దాని కోసం కొంత సమయం, భూమిని వెచ్చించి కావాల్సిన పంటలను సాగు చేసుకునేవారు. ఒకరికొకరు సాయం చేసుకుంటూ లాభాలు పొందేవారు. ఇప్పుడు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నారు. ప్రస్తుతం రైతులు నారు కోసం నర్సరీలను ఆశ్రయిస్తున్నారు. దీనివల్ల రైతుల సమయం, ఖర్చు ఆదా అవుతోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



ట్రేల నుంచి నారును వేరు చేస్తున్న మహిళలు

- పంటల సాగులో కొత్త విధానం
- నారు కోసం నర్సరీలను ఆశ్రయిస్తున్న రైతులు



అనంతపల్లిలో షెడ్ నెట్‌లో పెంచుతున్న నారుమళ్లు

నల్లజర్ల: ఒకప్పుడు వంగ, టమాట, మిరప వంటి పంటలు సాగు చేయాలంటే రైతులు ముందస్తు ఏర్పాట్లు చేసుకునేవారు. రైతు పొలంలోనే వారికి కావాల్సిన నారు కోసం కొంత విస్తీర్ణంలో భూమిని చదును చేసి బలం వేసి విత్తనం చల్లేవారు. అవి మొక్కలయ్యాక వాటిని పొలాల్లో నాటేవారు. ఈ పనుల కోసం దాదాపు నెలా పదిహేను రోజులు సమయం పట్టేది. మిరప, టమట, వంగ సాగు విస్తీర్ణం పెరగడం తక్కువ సమయంలో పంట దిగుబడులు రావాలని అన్నదాతలు ఆరాట పడుతున్నారు. ఏడాదికి మూడు పంటలు సాగు చేసేలా రైతాంగం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. దీంతో టమాట, మిరప, వంగ నారుమళ్లకు ప్రత్యామ్నాయంగా రెడీ మేడ్‌గా మొక్కలు సరఫరా చేసే నర్సరీలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి.

మిరప, వంగ సాగు ఎక్కువ

మండలంలో తెలికిచెర్ల, అచ్చన్నపాలెం, ఆవపాడు, ప్రకాశరావుపాలెం, సింగరాజుపాలెం, పుల్లలపాడు, ముసుళ్లగుంట, మార్కెళ్లమూడిలలో కూరగాయల సాగు ఎక్కువగా ఉంది. ఆయా రైతులకు అవసరమైన నారును షేడ్‌నెట్‌లో ముందుగానే సిద్ధం చేసి రైతులకు విక్రయిస్తున్నాడు. అనంతపల్లికి చెందిన నిరుద్యోగ యువకుడు కిలారి భాస్కరావు అన్ని రకాల నారు తయారీ చేసి రైతులకు అందిస్తున్నాడు. గత మూడేళ్లగా వంగ, మిరప.టమాట, మునగ, చిక్కుడు, గుమ్మడి, బెండ తదితర నారును తయారు చేస్తున్నాడు.

పాత పద్ధతికి స్వస్తి

గతంలో నారు తయారు చేసే నర్సరీల మాటే లేదు. రైతులు తమ పొలాలను నారుమళ్లకు సిద్ధం చేసి 20, 30 రోజులలో నారుమళ్లు రాగానే పరస్పరం ఒకరికొకరు సహకరించుకుంటూ పంటల సాగు చేసేవారు. ఇప్పుడు రైతాంగం మొత్తం నర్సరీలపైనే ఆధారపడి మొక్కలను కొనుగోలు చేస్తున్నారు.

ఏటా విక్రయిస్తాం



గత మూడు సంవత్సరాలుగా సేంద్రియ పద్ధతిలో ఏటా మూడు లక్షలకు పైగా వివిధ రకాల నారు మొక్కలు రైతులకు విక్రయిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితులలో రైతులంతా నర్సరీలనే ఆశ్రయిస్తున్నారు. పంటకు మంచి ధర లభిస్తే మొక్కల విక్రయం బాగుంటుంది. లేకపోతే ధర పడిపోతుంది. అందుకే సరైన పద్ధతిలో మొక్కలను తయారు చేస్తున్నాం.

– భాస్కరావు, నర్సరీ యజమాని

సమయం ఆదా



ఇప్పుడు నారుమళ్లు కట్టే రైతులు లేరు. అందరూ నర్సరీలపైనే ఆధారపడుతున్నారు. తద్వారా రైతులకు సమయం ఆదా అవుతోంది. అంతేకాకుండా షేడ్‌నెట్‌లో పెంచే నారు నర్సరీల ద్వారానే వస్తోంది. సరిపడ సూర్యరశ్మి, నీరు సమయానికి అందించి ఎటువంటి చీడపీడలు లేకుండా పెంచుతున్నారు. దీనివల్ల రైతులకు మేలు జరుగుతుంది. దిగుబడి కూడా బాగుంటుంది.

– బబిత, ఉద్యానశాఖాధికారి, నల్లజర్ల

మొక్కను బట్టి ధర

ఈ ప్రాంతంలో వంగ, టమాట, మిరప ఎక్కువగా సాగు చేస్తున్నారు. రైతులు తమ వద్ద ఉన్న విత్తనాలను నర్సరీ యజమానులకిచ్చి ట్రేలలో నారు పెంచడం ఒక పద్ధతి కొనసాగుతోంది. ఈ పద్ధతిలో మొక్కకు ఇంత అని ఇస్తుంటారు. నర్సరీ యజమానే విత్తనాలు తీసుకువచ్చి ట్రేలలో నారు పెంచి అమ్మడం మరో పద్ధతి. ఈ పద్ధతిలో మొక్కను బట్టి ధర ఉంటుంది. ఒక్క రకం రూ.2 నుంచి రూ.1.50 వరకూ ఉంటుంది.

క్లుప్తంగా

నేటి వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయండి

గోపాలపురం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75 జయంతి కార్యక్రమం సోమవారం గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్ వద్ద ఉన్న నిర్వహించనున్నట్టు మండలపార్టీ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మాజీ హోంశాఖ మంత్రి తానేటి వనిత హాజరవుతారని మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని నాగరాజు కోరారు.

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నిర్వహిస్తున్న వైఎస్సార్ జయంతి వేడుకల్లో రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత పాల్గొంటున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవరపల్లి బస్టాండ్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి ఆమె పూల మాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం గోపాలపురంలో జరిగే వేడుకల్లో పాల్గొంటారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కోరారు.

నేడు మండల సమావేశం

ఉండ్రాజవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జీడీవీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అర్చక సంక్షేమానికి కృషి చేయాలి



తాళ్లపూడిలో సమావేశంలో పాల్గొన్న అర్చక సమాఖ్య ప్రతినిధులు

తాళ్లపూడి: అర్చక సమాఖ్యలు తిరిగి పునర్జీవం పోసుకుని, అర్చకుల సంక్షేమం కోసం రాష్ట్రస్థాయిలో చైతన్యవంతం కావాలని అర్చక ప్రముఖులు పెద్దింటి రంగబాబు అన్నారు. గ్రామంలోని శివాలయం వద్ద ఆదివారం జరిగిన సమావేశానికి ఏడు మండలాలు పోలవరం, తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, నల్లజర్లకు చెందిన అర్చక సమాఖ్య సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు అర్చక సమాఖ్య సభ్యులు జంధ్యాల గంగాధర శర్మ, రంగబాబు తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో అర్చక సమాఖ్యాలు నిర్జీవయ్యాయని, తిరిగి పునర్జీవం పోసుకునేందుకు చేయాల్సిన కార్యాచరణ కోసం చర్చించుకున్నట్టు తెలిపారు. వైదిక స్మార్త ఆగమం, శైవాగమం పాంచరాత్ర ఆగమం, వైఖానాసగమం, తంత్రసాల ఆగమం, గ్రామ దేవత అర్చక సంఘాలు అన్ని ఆగమాలు సమష్టిగా అర్చక సమస్యలపై కృషి చేస్తామని తెలిపారు.

గాయత్రీ బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా కూచిభట్ల



తాళ్లపూడిలో సమావేశమైన సభ్యులు

తాళ్లపూడి: గ్రామంలో గాయత్రి బ్రాహ్మణ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు సంఘం అధ్యక్షుడు మేడూరి గంగాధర శాస్త్రి తెలిపారు. సమావేశంలో సంఘం నూతన అధ్యక్షుడిగా తాళ్లపూడికి చెందిన కూచిభట్ల ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గుంటూరి బాలవెంకటసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చేబోలు రమేష్, కోశాధికారిగా కల్లూరి వీర రాఘవశర్మ, కార్యదర్శులుగా ఎల్. సత్యనారాయణ, గోవర్ధనం మదన గోపాలచార్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులుగా హెచ్‌వీ సత్యనారాయణ, రేకపల్లి జగన్నాథం, జంధ్యాల గంగాధర శర్మ, సత్యనారాయణ, చక్రవర్తి పాల్గొన్నారు.

రైళ్ల హాల్టును పునరుద్ధరించాలి

కొవ్వూరు: కరోనా సమయంలో కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో నిలిపివేసిన 36 రైళ్ల హాల్టును పునరుద్ధరించాలని రైల్వేస్టేషన్ పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద పరిరక్షణ సమితి సభ్యులు సమావేశమయ్యారు. ఇటీవల ఆంధ్రా సుగర్స్, అవంతీ ఫీడ్స్ కర్మాగారాల యాజమాన్యం రైల్వేశాఖ జీఎంకి విజ్ఞప్తి చేయడం, వినతిపత్రం అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎంపీ స్థానిక ఎంపీ కావడంతో రానున్న రోజుల్లో ఈ రైల్వే స్టేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎన్‌డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున రైల్వే స్టేషన్ పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. విల్సన్‌రాజు, వైకే శ్రీనివాస్, పడాల సుబ్బారెడ్డి, టీడీఎల్ ప్రసాద్, కంకటాల రాంబాబు, వల్లూరి రవి, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో భారీ వర్షం

తాళ్లపూడి: మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లోని రహదారులు, ఇళ్ల నీట మునిగాయి. ప్రజలు అవస్థలు పడ్డారు. తాళ్లపూడిలోని ఎస్సీ ఏరియాలో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన శాప్ డైరెక్టర్ వరలక్ష్మి



జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి

గోపాలపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గోపాలపురం గ్రామానికి చెందిన రాష్ట్ర క్రీడలశాఖ మాజీ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి అమరావతి పార్టీ కార్యాలయంలో కలిసినట్టు ఆదివారం ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. పార్టీ కష్టకాలంలో పని చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపినట్టు ఆమె పేర్కొన్నారు.

వ్యాధులపై వినూత్నంగా ప్రచారం

నల్లజర్ల: ప్రస్తుతం ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కోరుతూ వైద్య, ఆరోగ్య ఉద్యోగులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారం విజయవంతంగా జరుగుతోందని వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవివి ప్రసాద్ తెలిపారు. ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్ వినియోగంలో ముందున్నారని, ఈపరిస్థితి గమనించి ప్రజలకు అత్యవసరమైన ఆరోగ్య విషయాలను మొబైల్ ద్వారా సమాచారం అందించే కార్యక్రమం విజయవంతం చేసినట్టు ఆయన తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లో అలాగే స్టేటస్‌లో ప్రస్తుతం వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, అతిసారంపై ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వీడియోల రూపంలో ప్రజలకు మొబైల్ ద్వారా పంపిస్తున్న సందేశాలకు మంచి స్పందన వస్తోందని ప్రసాద్ వివరించారు.

పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తుల ఆగ్రహం



అన్నవరప్పాడులో వాటర్ ట్యాంక్ వద్ద వేసిన బెంచీలు, చలువ పందిరి

పెరవలి: అన్నవరప్పాడు గ్రామంలో వాటర్ ట్యాంకు వద్ద దాతల సహకారంతో వేసిన సిమెంటు బెంచీలు, ప్రజల సౌకర్యం కోసం వేసిన చలువ పందిరి, అందులో వేసిన ఫ్యాన్ తొలగించాలంటూ పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు ఆదేశించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంచీలు, పందిరి, అందులో వేసి ఫ్యాన్ పంచాయతీ నిధుల నుంచి ఏర్పాటు చేసినవి కావు. దాతలు సాయంతో వేసినవి అయినా కానీ ఈఓపీఆర్‌డీ (పంచాయతీల విస్తరణాదికారి)ని తీసుకువచ్చి సిమెంటు బెంచీలు, చలువ పందిరి తొలగించాలని ఆదేశించారు. దీంతో గ్రామస్తులు వాటిని ఎందుకు తొలగించాలని ప్రశ్నించారు. ఇది మీకు సంబంధం లేని విషయమంటూ పంచాయతీ కార్యదర్శి బదులివ్వడంతో గ్రామస్తులు మండి పడ్డారు. బెంచీలు, పందిరి ఉండడం వల్ల వాటర్ ట్యాంకు వద్దకు వచ్చేవారే కాకుండా, ఇక్కడకు పక్కనే ఉన్న సాయిబాబా, అమ్మవారి ఆలయాలకు వచ్చే భక్తులు సేద తీరుతున్నారని, వీటిని తొలగించడం సరికాదని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



దేవరపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

దేవరపల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాప దినోత్సవ వేడుకలను ఆదివారం దేవరపల్లిలో ఘనంగా నిర్వహించారు. భారత ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తాతపూడి సురేష్ మాదిగ, మండల అధ్యక్షుడు కోడి సూరి మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాలకు న్యాయం జరగాలంటే ఎస్సీ వర్గీకరణ వలన సాధ్యమవుతుందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, టీడీపీ, జనసేన, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో పలు గ్రామాల్లో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు ఆదివారం తెలిపారు. పాలంగిలో జరిగిన జెండా ఆవిష్కరణలో ఎంఆర్‌పీఎస్ నాయకులు నేకూరి వీర్రాజు, జుత్తిగ కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత ఇసుక ప్రారంభం



పెండ్యాలలో ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అధికారులు

పెరవలి: ఉచిత ఇసుక సోమవారం ప్రారంభించనున్నారు. దీనికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెరవలి మండలం తీపర్రులో వేసిన ఇసుక గుట్టలను జిల్లా మైనింగ్ అధికారి విఘ్నేష్ రెవెన్యూ, పోలీసు డిపార్టుమెంట్ అధికారులు బృందం ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ అధికారి విఘ్నేష్ మాట్లాడుతూ తీపర్రులో 20 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని, దీనిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయిస్తారని తెలిపారు. గోదావరిలో ఇసుకను తీసుకువెళ్తితే అక్కడ ప్రభుత్వానికి రూ.88 చెల్లించాలని ఈ నిధులు నేరుగా స్థానిక సంస్థల నిధులకు జమవుతాయన్నారు. ఎగుమతి కూలి, బాట చార్జీల ధరలు నిర్ణయించాల్సి ఉందని తెలిపారు. ఈ ధరలను జిల్లా కలెక్టర్ నిర్ణయిస్తారని సోమవారం నుంచి ఇసుక అమ్మకాలు జరుగుతాయని తెలిపారు. ఒక్కొక్కరికి 20 టన్నులు మాత్రమే పంపిణీ చేస్తారని అందుకు తగిన పత్రాలు ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఎస్ఐ ఏజీఎస్ మూర్తి, సర్వేయర్ గోపాలకృష్ణ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఉచిత ఇసుక విధానం

నిడదవోలు రూరల్: ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి డివిజన్ పరిధిలో పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నామని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. మండలంలోని పెండ్యాల ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆదివారం అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గనులు, భూగర్భజల, ఎన్‌ఫోర్స్‌మెంట్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అవసరమైన చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకుని అనధికార ఇసుక రవాణాను అరకడతామన్నారు. తహసీల్దార్ నాగభూషణం, ఎస్సై రమేష్, ఆర్ఐ సత్యేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చెత్త తొలగింపు



దేవరపల్లిలో చెత్తను తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

దేవరపల్లి: గ్రామాల్లో పారిశుద్య నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టారు. గత వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పలు గ్రామాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు విజృంభించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో జిల్లా అధికారులు పారిశుద్య నిర్వహణపై దృష్టి పెట్టారు. గ్రామాల్లో పరిశుభ్రత కార్యాక్రమాలు నిర్వహించాలని, మంచినీటీ సరఫరా ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలని, పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు అందడంతో పంచాయతీ అధికారులు గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గత కొంత కాలంగా రోడ్ల పక్కన, గ్రామాల్లోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి డప్పింగ్ యార్డులకు తరలిస్తున్నారు. రెండు రోజుల్లో మండలంలో కలెక్టర్ పర్యటన ఉంటుందని సమాచారం రావడంతో గ్రామ పంచాయతీ అధికారులు ఆగమేఘాలపై చెత్తను తొలగిస్తున్నారు. దేవరపల్లిలో ఆదివారం అధికారులు పారిశుద్య నిర్వహణ పనులను ముమ్మరంగా చేపట్టారు. నాలుగు జేసీబీ మిషన్లు, ఆరు లారీలు, 12 ట్రాక్టర్లను ఏర్పాటు చేసి గ్రామంలో చెత్త కుప్పలు, వ్యర్థాలను తొలగించినట్టు కార్యదర్శి ఎస్.రవికిషోర్ తెలిపారు. మంచి నీటి పైపుల లీకేజీలు లేకుండా మరమ్మతులు చేసి అరికట్టినట్టు ఆయన తెలిపారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

నల్లజర్ల: రబీ ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మే నెల నుంచి ధాన్యం నిలచిపోయినట్టు రైతులు చెబుతున్నారు. దాదాపు 576 మంది రైతులు 6,132.46 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగొలు చేసింది. ఇందుకోసం రైతులకు రూ.13.38కోట్లు అందించాల్సి ఉండగా ఇంత వరకు రూ.8.17 కోట్ల అందించారు. ఇంకా 233 మంది రైతులకు రూ.5.21కోట్ల బకాయిలు ఉన్నాయని చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తామని చెప్పిన చంద్రబాబు సర్కారు వెంటనే రైతులకు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.3 లక్షల వరకు ఉన్న సున్నా వడ్డీని రూ.5లక్షల వరకు పెంచి రుణ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఎటువంటి ష్యూరిటీ లేకుండా రైతులకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతులు కోరుతున్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

నిడదవోలు: రోటరీ క్లబ్ సభ్యులు చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమని పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని నందన ఆడిటోరియంలో ఆదివారం రోటరీ క్లబ్ నిడదవోలు సెంట్రల్ సాగర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతరులకు సేవ చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. నూతన కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. 2024 రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ నూతన అధ్యక్షుడిగా కొండేపాటి రామకృష్ణ, సెక్రటరీ జీవీఎస్ కృష్ణారావు, ట్రెజరర్ ఈదల నాగేశ్వరావుల తోపాటు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిడదవోలు పట్టణానికి చెందిన కాసాని దుర్గిరాజు (బాబ్జి) గత కొంతకాలంగా పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నారు. అతనికి నిడదవోలు లైన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు మాజీ అధ్యక్షుడు రంగా వెంకటేశ్వరరావు రూ.పదివేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, క్లబ్ మాజీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



గోపాలపురంలో శాంతి రథాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

గోపాలపురం: మండల మానవత స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మానవత జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. గోపాలపురం ఏఎంసీ ఆవరణలో ఆదివారం మండల మానవత నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ గోపాలపురం మండలానికి దాతలు అందిస్తున్న సేవలను కొనియాడారు. మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన దాత పద్మసాయి ఫైనాన్స్ అధినేత తానింకి సత్యనారాయణ(బాబి) రూ.8లక్షల విలువైన శాంతి రథాన్ని మానవత సంస్థకు అందజేయడం అభినందనీయమన్నారు. మానవతా జిల్లా నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, రామిశెట్టి గంగాధరం, బలుసు సత్యనారాయణలు నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా పి.సత్యకృష్ణారెడ్డి, కార్యదర్శులు కె.కీర్తికుమార్, గడ జోగేంద్రప్రసాద్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం గత పదేళ్లలో మూడు శాంతి రథాలు, ఒక ఫ్రీజర్‌ను అందజేసిన దాత సత్యనారాయణను సభ్యులు ఘనంగా సత్కరించారు.

అందుబాటులో 3 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక

- ఇసుక నిల్వలు తనిఖీ చేసిన అధికారుల బృందం
- నేటి నుంచి ప్రారంభం కానున్న ఉచిత ఇసుక పాలసీ



వాడపల్లి ఇసుక ర్యాంపులో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, మైన్స్ ఏజీ విఘ్నేష్, అధికారులు

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా ఉన్న ర్యాంపుల్లోను, స్టాక్ పాయింట్‌లను నిల్వలు తనిఖీ చేయగా సుమారు 3 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని మైన్స్ అండ్ జియాలజీ ఏజీ జి.విఘ్నేష్ తెలిపారు. ఉచిత ఇసుక పాలసీని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాలో ఇసుక నిల్వలను రెవెన్యూ, నీటి పారుదల, ఎస్ఈబీ శాఖ అధికారులతో కూడిన అధికారుల బృందం తనిఖీ చేసింది. కొవ్వూరు మండలంలో వాడపల్లి, ఔరంగబాద్‌లతో పాటు కుమారదేవం స్టాక్ పాయింట్ లను అధికారుల బృందం పరిశీలించింది. ప్రత్యేక పరికరం ద్వారా ఇసుక నిల్వలను అంచనా వేశారు. ముందుగా స్టాక్ పాయింట్‌లలో నిల్వ ఉన్న ఇసుకని తరలింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. నది గర్భం నుంచి స్టాక్ పాయింట్‌లకు ఇసుక తరలించిన నేపథ్యంలో రవణా చార్జీలు,సీనరేజీ వంటి కలిపి ధర నిర్ణయించాల్సి ఉంటుందన్నారు.తనిఖీ పూర్తయిన తర్వత జిల్లా కలెక్టర్‌కి నివేదిక సమర్పించనున్నట్టు తెలిపారు. బోట్స్ మెన్ సొసైటీ ర్యాంపుల్లో పదేళ్ల క్రితం నుంచి టన్నుకి రూ.200 చొప్పున చెల్లిస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన డీజిల్, కూలీ ధరలను దృష్టిలో ఉంచుకుని రూ.250 చెల్లించాలని బోట్స్‌మెన్ సొసైటీ నాయకులు, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు) కోరారు. పడవలపై వేలాది మంది కార్మికుల ఉపాధి ముడిపడి ఉన్నందున బోట్స్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచే ర్యాంపుల్లో ధర నిర్ణయంపై వాస్తవ పరిస్థితులను కలెక్టర్‌కి, ప్రభుత్వానికి నివేదించాలని పడవ కార్మికులు, యజమానులు కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టి తీసుకెళ్తామని అధికారులు స్పష్టం చేశారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తహసీల్దార్ కె.మస్తాన్, నీటి పారుదల శాఖ ఏఈ సునీల్, ఆర్ఐ విశ్వేశ్వరరావు, బోట్స్‌మెన్ సొసైటీ నాయకులు మట్టా అప్పారావు, పాకా జయరామ్, కండెల్లి రామారావు, బర్ల శ్రీనివాస్, రాచర్ల నరేష్, పాకా చిన్నా, కోమలి రాజు తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.1,79,636 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ నాట్లు

చాగల్లు: మండలంలో ఖరీఫ్ నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 8400 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. రైతులు ఎక్కువగా ఎంటీయూ 1318, సంపత్ స్వర్ణ రకాలు సాగు చేస్తున్నారు. మల్లవరం, గౌరిపల్లి, చంద్రవరం, దారవరం, మార్కొండపాడు, నెలటూరు, చాగల్లు, ఎస్.ముప్పవరం, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో 70 శాతం నాట్లు పూర్తయ్యాయని, నాట్లు వేసే సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకుంటే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.వేణుగోపాల్ సూచిస్తున్నారు.